# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-17-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 288 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

**శాసనసభ ప్రాంగణంలో ఘన కార్యక్రమం**

**తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా తెలంగాణ తల్లి**

**బడ్జెట్ సమావేశాల తొలి రోజున ప్రత్యేక వేడుక**

**హైదరాబాద్, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి ప్రతీకగా భావించే "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ప్రజల్లో ప్రత్యేక భావోద్వేగాన్ని కలిగించింది. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ దినాన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

మిగతా 2లో..

## అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం


**ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం**

**సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు**


**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం**

**సంక్షేమం, అభివృద్ధి, పాలనా సంస్కరణలపై ప్రభుత్వ రోడ్ మ్యాప్ ఆవిష్కరణ**

2లో







### నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం: హరీష్ రావు

**కృష్ణా, గోదావరి జలాలపై ప్రభుత్వాన్ని విమర్శించిన బీఆర్ఎస్**

**రాష్ట్రాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారని ఆరోపణ**

**అసెంబ్లీ మీడియా హాల్‌లో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు**

2లో



### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

**మంత్రుల సమీక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు**

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు**

**ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై చర్యలు**

2లో



### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్థికవేత్త అర్విింద్ సుబ్రమణియన్ భేటీ

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కీలక చర్చ**

**పలు రంగాల్లో సంస్కరణలపై సూచనలు**

**అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో సమావేశం**

2లో

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



- ప్రముఖ కవికి లభించిన జాతీయ గుర్తింపు
- అభినందనలు తెలిపిన కేసీఆర్
- 'అనిమేష'కవితా సంపుటికి అవార్డు

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రదానం చేసే అత్యున్నత సాహిత్య పురస్కారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - 2025 ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి దక్కడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

మిగతా 2లో..





2లో

## పైలట్ రోహిత్ రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్‌లో చర్చలు

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ భేటీ

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో భారత ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మరియు భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా రాష్ట్ర ఆదాయ వనరులను పెంచడం, ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలపై అర్వింద్ సుబ్రమణియన్ ముఖ్యమంత్రితో చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మె



రుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రత్యేకంగా విద్యుత్ రంగం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, జీఎస్టీ విభాగాల్లో సంస్కరణలు చేపట్టే అంశాలపై సమావేశంలో చర్చించారు. జీఎస్టీ పన్నుల అంచనా విధానం, ఆదాయ వనరుల పెంపు, నమూనా మూల్యాంకనం వంటి అంశాలపై సుబ్రమణియన్ తన అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన విధానాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమర్థంగా వినియోగించడం, ఆదాయాన్ని పెంచే మార్గాలపై అధికారులు మరియు ఆర్థిక నిపుణులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సమావేశంలో పేర్కొన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం ప్రారంభానికి ముందు గవర్నర్, ముఖ్యమంత్రి కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదుట ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలుస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమం ద్వారా సాధించిన రాష్ట్ర అస్తిత్వాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలిచే చిహ్నంగా ఈ విగ్రహం నిలుస్తుందని పేర్కొన్నారు.

# అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా రాష్ట్రం ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు వివరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వివిధ రంగాల్లో సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పాదకత పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడం, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించినట్లు తెలిపారు. వేగంగా పెరుగుతున్న నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించామని చెప్పారు. మూసీ నది తీర అభివృద్ధి ప్రాజెక్టుతో పాటు సరస్సులు, చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని గవర్నర్ వెల్లడించారు. పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ కీలక గమ్యస్థానంగా మారిందని గవర్నర్ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్ వంటి కార్యక్రమాల ద్వారా భారీ పెట్టుబడులను సాధించామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలు, బుల్లెట్ రైలు ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. అలాగే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని గవర్నర్ వివరించారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, పేదలకు సన్నబియ్యం అందించడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్లు, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలు అమలులో ఉన్నాయని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు చేపట్టి కొత్త మెడికల్ కాలేజీలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.

# పైలట్ రోహిత్ రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్‌లో చర్చలు

- మొయినాబాద్ ఫార్మ్ హౌస్‌పై పోలీసుల దాడి
- డ్రగ్స్ వినియోగం ఆరోపణలతో రాజకీయ కలకలం
- ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం
- పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచన భావన

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పేరు ఇటీవల వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ పార్టీ వివాదంతో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ప్రాంతంలోని ఆయన ఫార్మ్ హౌస్‌లో జరిగిన పార్టీపై పోలీసులు దాడి చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ ఘటనలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడినట్లు సమాచారం. పోలీసులు ఫార్మ్ హౌస్‌పై దాడి చేసిన సమయంలో అక్కడ డ్రగ్స్ వినియోగం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనలో పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక పరీక్షల్లో కొందరు డ్రగ్స్ వినియోగించినట్లు తేలినట్లు సమాచారం రావడంతో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ఘటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పేరు కూడా వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. ఆయనకు చెందిన ఫార్మ్ హౌస్‌లోనే పార్టీ నిర్వహించబడినట్లు పోలీసులు గుర్తించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ కూడా అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పార్టీ ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారంపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో పైలట్ రోహిత్ రెడ్డి సస్పెన్షన్‌పై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే వరకు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించే అవకాశముందని కూడా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆస్తి పన్ను ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోండి

- 90% వడ్డీ మాఫీతో ప్రత్యేక అవకాశం
- మార్చి 31 వరకు పథకం అమలు
- ప్రజలు బకాయిలు చెల్లించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ పిలుపు



**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఆస్తి పన్ను బకాయిలు ఉన్న పన్ను చెల్లింపుదారులు వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు. బకాయి ఉన్న ఆస్తి పన్నుపై వడ్డీకి 90 శాతం రాయితీ ఇచ్చే ఈ పథకం ద్వారా పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను సులభంగా క్లియర్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న మొత్తం 28.08 లక్షల పన్ను చెల్లింపుదారుల్లో 16.8 లక్షల మంది ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆస్తి పన్ను రూపంలో రూ.2,186 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. గత సంవత్సరం ఇదే సమయంలో రూ.1,984 కోట్లు వసూలైనట్లు పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు మీ సేవ కేంద్రాలు, జీహెచ్ఎంసీ అధికారిక వెబ్‌సైట్, పౌర సేవా కేంద్రాలు మరియు మైక్యూర్ మొబైల్ యాప్ ద్వారా సులభంగా ఆస్తి పన్ను చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. పన్ను చెల్లింపు ప్రక్రియను సులభతరం చేయడానికి జీహెచ్ఎంసీ పలు డిజిటల్ సేవలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ఇక ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని ఆరు జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డుల్లో చెత్త నిర్మూలన, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, ఈవేస్ట్ సేకరణ, అగ్నిమాపక భద్రత తనిఖీలు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఓటీఎస్ పథకం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బస్ షెల్టర్లు, ఎఫ్ఎం రేడియో, కేబుల్ ఛానెల్లు, సినిమా థియేటర్లు మరియు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను క్లియర్ చేసుకుని నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** క్యూర్ పరిధిలో మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరియు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో పూర్తిగా పారదర్శకత ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ మరియు ఇతర గృహ పథకాల కింద ఇళ్లు పొందిన వారు వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్న లేదా ఖాళీగా ఉంచుతున్న పరిస్థితులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేసి స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన వారితో ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా అండర్‌టేకింగ్ తీసుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ సహకారం తీసుకోవాలని సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తయిన వాటిని వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ వీపీ గౌతమ్, నాలుగు జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం: హరీష్ రావు

**హైదరాబాద్, 16 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరి వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. సమైక్య రాష్ట్ర కాలంలో నీటి విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిందని హరీష్ రావు పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ నాయకత్వంలో కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను బలంగా నిలబెట్టామని చెప్పారు. కృష్ణా నదిలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి నీటి పునఃపంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గోదావరి నదిపై బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడేందుకు గత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. గోదావరిలో మొత్తం 1400 టీఎంసీల నీటిలో 968 టీఎంసీలు తెలంగాణకు, 518 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డాయని వివరించారు. ఈ హక్కులను స్థిరపరచడానికి అనేక ప్రాజెక్టులను నిర్మించి 400 టీఎంసీల ప్రాజెక్టులకు అనుమతులు సాధించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ ప్రభుత్వం కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని హరీష్ రావు ఆరోపించారు. కృష్ణా నదిలో నీటి వినియోగంపై వివాదాలు కొనసాగుతుండగా ఇప్పుడు గోదావరి జలాలపై కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. జనవరి 30న ఢిల్లీలో రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారుల సమావేశం జరిగినట్లు ఆయన తెలిపారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్ ఫిబ్రవరి 12నే రాష్ట్రానికి వచ్చినప్పటికీ నెల రోజులు గడిచినా తెలంగాణ ప్రభుత్వంవైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదని విమర్శించారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేఖల డ్రామాలు మానుకుని తెలంగాణ ప్రయోజనాలను రక్షించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా నందిని సిధారెడ్డికి ఆయన అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల్లో ఏర్పడిన విచ్ఛిన్నతను కవిత్వం ద్వారా హృద్యంగా ప్రతిబింబించిన దీర్ఘ కవితా సంపుటి “అనిమేష”కు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడం గర్వకారణమని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కవితా సంపుటి సమకాలీన సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా నందిని సిధారెడ్డి తన రచనల ద్వారా తెలంగాణ జీవన విధానాన్ని అక్షరబద్ధం చేశారని కేసీఆర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను తన కవిత్వంలో ప్రతిబింబింపజేసి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి సాహిత్య రంగంలో ఆయన విశేష సేవలు అందించారని కేసీఆర్ గుర్తుచేశారు. సామాజిక సమానత్వం, ప్రజా సమస్యలపై స్పందిస్తూ తన కలాన్ని సమాజానికి అంకితం చేసిన రచయితగా ఆయన నిలిచారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా నందిని సిధారెడ్డి తన సాహిత్యం, పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని కేసీఆర్ తెలిపారు. ఉద్యమ కవిగా ప్రజల్లో చైతన్యం రగిలించి తెలంగాణ ప్రజల అభిమానాన్ని పొందారని పేర్కొన్నారు. ఈ అవార్డు తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు కేసీఆర్ అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## అన్నప్రసాద వితరణలో నందనంపాటి రాముకు “అన్నదాన సేవా చక్రవర్తి”అవార్డు

**కుషాయిగూడ, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** పేదలు, భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భావాన్ని చాటుతున్న ఈసీఐఎల్‌కు చెందిన సోలిస్ ఐ కేర్ సీఎండీ, తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ నందనంపాటి రామును ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సోమవారం ఈసీఐఎల్‌లోని సోలిస్ ఐ కేర్ హాస్పిటల్‌లో “అన్నదాన సేవా చక్రవర్తి” అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనకు అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి పాల్గొని నందనంపాటి రామును అభినందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందనంపాటి రాము సమాజంలో సేవా కార్యక్రమాలకు ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పాండిచ్చేరిలోని తిరునల్లార్‌లోని ప్రసిద్ధ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన శని పేర్చి పవిత్ర ఉత్సవాల సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ మరియు సోలిస్ ఐ కేర్ ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదవసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నందనంపాటి రాము పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ చేతుల మీదుగా నందనంపాటి రాముకు “అన్నదాన సేవా చక్రవర్తి” అవార్డు ప్రదానం చేశారు. పేదలు, అవసరమైన వారికి అన్నప్రసాదం అందించడం ద్వారా ఆయన మానవతా విలువలను చాటుతున్నారని వక్తలు అన్నారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న కృషికి ఎన్ని అవార్డులు ఇచ్చినా తక్కువేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సోలిస్ ఐ కేర్ సిబ్బంది విజయేందర్ రెడ్డి, మహేష్, విజయలక్ష్మి, భాస్కర్, గజేందర్, మోహన్, నీరజ తదితరులు పాల్గొని నందనంపాటి రామును అభినందించారు.

## దళితుల అభ్యున్నత కోసం సంక్షేమ పథకాలు బలోపేతం చేయాలి

- **దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్**



**ఎల్కతుర్తి, మార్చ్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, కార్యదర్శి రెంటాల దేవా మాట్లాడుతూ దళితుల అభ్యున్నత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాదాపు 76 సంవత్సరాలు గడిచినా దళితులు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.

దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, జనాభా ఆధారంగా బడ్జెట్‌లో 20 శాతం నిధులను దళితులకు కేటాయించాలని కోరారు. కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా దళితుల సంక్షేమానికి వినియోగించాలని అన్నారు.

ప్రైవేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు సబ్సిడీ నిధులను విడుదల చేసి, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు.

దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అంటరానితనాన్ని తక్షణమే అరికట్టాలని, భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించాలని తెలిపారు. దళితులకు విద్యా హక్కు, భూమి హక్కు మరియు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా మేనిఫెస్టోలో పేర్కొన్న అంబేద్కర్ హస్తం పథకం కింద దళితులకు 12 లక్షల రూపాయల మంజూరు అంశంపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదని అన్నారు. మార్చి 16 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

అలాగే పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో 50 శాతం ఇళ్లు దళితులకు కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశాలపై దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, ధర్మసాగర్ మండల కార్యదర్శి రాజారపు రత్నం తదితరులు పాల్గొన్నారు.

# సీఆర్పీల సమస్యలు పరిష్కరించాలి!

- **ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన సీఆర్పీ యూనియన్ నాయకులు**
- **పర్మినెంట్ చేయాలని, టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్**

**దమ్మపేట, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



సీఆర్పీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం దమ్మపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి గారికి సీఆర్పీ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర సీఆర్పీ యూనియన్ కమిటీ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు పాడియా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వగ్గేల వెంకటేశ్వరరావుతో కలిసి ఎంపీడీవోకు సీఆర్పీల సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మండల స్థాయిలో ఎమ్మార్పీలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేసేవారని తెలిపారు. అనంతరం రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుల స్థానంలో బి.ఈడి, టెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులను సీఆర్పీలుగా నియమించారని పేర్కొన్నారు. గత 13 సంవత్సరాలుగా కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, హ్యాబిటేషన్ పరిధిలో ఉన్న బడి బయట పిల్లలను గుర్తించి మళ్లీ పాఠశాలలో చేర్పిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని, వారి తల్లిదండ్రులతో నిరంతరం మాట్లాడి విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కొన్నిచోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధన కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం తమపై చిన్నచూపు చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.ఏ, ఎం.ఎస్సి / బి.ఎస్సి, బి.ఈడి, టెట్ వంటి అర్హతలు ఉన్నప్పటికీ కనీస వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలలను సందర్శించడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ప్రయాణ ఖర్చులను కూడా తమ స్వంత డబ్బులతోనే భరించాల్సి వస్తోందని వివరించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు తమ డిమాండ్లను వెల్లడించారు. సీఆర్పీ ల పేరును క్లస్టర్ రిసోర్స్ టీచర్స్‌గా మార్చాలని, సీఆర్పీలను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్ తో పాటు ఆరోగ్య భీమా కల్పించాలని, పాఠశాల సందర్శన సమయంలో ప్రమాదం జరిగితే ప్రభుత్వం ప్రమాద బీమా కింద రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం టర్మినేషన్, రీన్యువల్, బాండ్ అగ్రిమెంట్ వంటి విధానాలు లేకుండా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. రోజుకో పాఠశాల సందర్శన చేయడానికి ట్రావెలింగ్ అలవెన్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ అర్హతలు ఉన్నందున శిక్షణ ఇచ్చి క్లస్టర్ రిసోర్స్ టీచర్స్‌గా గుర్తించాలని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలలో సీఆర్పీలకు 30 శాతం వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా అవసరమైన సీఆర్పీలకు జిల్లా మరియు అంతర్ జిల్లా బదిలీల అవకాశం కల్పించాలని, విధుల్లో ఉండగా మరణించిన సీఆర్పీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీఆర్పీల సంఖ్య ఆధారంగా జీతభత్యాల్లో ఉన్న వ్యత్యాసాలను సరిచేయాలని కోరారు. రిటైర్మెంట్ సమయానికి సీఆర్పీలకు కనీసం రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను గత 13 సంవత్సరాలుగా ప్రభుత్వాల దృష్టికి తీసుకువస్తున్నామని, అయితే ఇప్పటివరకు పరిష్కారం కాలేదని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే ఎక్కువ జీతం, పేరులో మార్పు వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారని ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు.







# ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు పంపిణీ

**మల్లాపూర్, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మల్లాపూర్ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్ అలీ అబూ తాలిబ్ మజీద్ వద్ద ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తో కలిసి కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు అందజేశారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వంతో కలిసి జీవించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రంజాన్ పండుగ ప్రేమ, సేవా భావం, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధన్పాల్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి అనీఫ్, వసీం సాబ్, ఎండి కబీర్, ఎండి బాబా, ఎండి ముజాహిద్, ఎండి రహమతుల్లా, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఎస్.వి. కిట్టు, కోయగూర బాలరాజ్, దంతూరి రాజు గౌడ్, మక్తాల బాలరాజ్, టిల్లు ముదిరాజ్, జానీ, భాయ్ ముజిబ్, సురేష్, జయంత్, టిల్లు, సాయి, వినేష్ తదితరులు మరియు మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి!

- **ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఏఐయుకేఎస్ ధర్నా.**

**దమ్మపేట, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**





రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా (రైతు బంధు)ను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయం వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐయుకేఎస్ మండల కార్యదర్శి పందూరి వీరబాబు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ సభ్యులు ఊకె అప్పారావు, కాక వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు సకాలంలో స్పందించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతు భరోసాను పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే రైతులకు అవసరమైన సమయంలో ఇప్పటికీ రైతు భరోసా అందకపోవడం వల్ల పంటల పెట్టుబడులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాకాలం ముగిసి యాసంగి (రబీ) సీజన్ సగం గడిచినా రైతు భరోసా విడుదల కాలేదని పేర్కొన్నారు. రైతులు భూములు చదును చేయడం, విత్తనాలు కొనుగోలు చేయడం, ఎరువులు వేయడం వంటి పనుల కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారని, ఈ పరిస్థితుల్లో రైతు భరోసా అందకపోవడం వల్ల మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని, పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం వంటి చర్యలు అన్యాయమని ఆరోపించారు.

అలాగే పంటలకు కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వం రూ.2400 కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ మార్కెట్లో రైతులకు రూ.1600 నుంచి రూ.1700 వరకు మాత్రమే ధర లభిస్తోందని చెప్పారు. ఎర్రజొన్నలకు కూడా ప్రకటించిన మద్దతు ధర అమలు కావడం లేదని తెలిపారు. అందువల్ల మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, ఎర్రజొన్న పంటలను కొనుగోలు చేయాలని, వ్యవసాయ మార్కెట్లలో వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తామరాముడు, కుంజ కాంతారావు, తెల్లం నాగేష్, రుక్కోల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ నాయకుల అరెస్టులకు నిరసనగా దమ్మపేటలో ధర్నా

- **ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్**
- **అంగన్వాడీలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ ఆందోళన**
- **- పెండింగ్ వేతనాలు, టీఐడీఏలు విడుదల చేయాలని విజ్ఞప్తి**

**దమ్మపేట, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**









అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాకు వెళ్తున్న రాష్ట్ర నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ హామీని నమ్మి ఓట్లు వేసిన తర్వాత ఇప్పుడు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని అడిగితే అది ప్రభుత్వానికి నేరంగా కనిపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చొరవ చూపలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఇస్తున్న కొద్దిపాటి వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, పని భారం మాత్రం విపరీతంగా పెంచి అంగన్వాడీలను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆందోళనలు నిర్వహిస్తుంటే మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి ఇళ్లపైకి వెళ్లి అరెస్టులు చేయడం సరైంది కాదని అన్నారు. గతంలో పాలకులకు ఎదురైన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికీ తప్పదని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ అరెస్టు చేసిన అంగన్వాడీ రాష్ట్ర నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు రూ.18 వేల వేతనం అమలు చేయాలని, పెండింగ్ టీఐడీఏలు, సెంటర్ హద్దులు, గ్రాట్యుటీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామకృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సూరమ్మ, జ్యోతి, రాజ్యలక్ష్మి, శాంతి, అజిత, కవిత, వెంకటేశ్వరమ్మ, జయ, జానకి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఆయిల్ పామ్ గెలల ధరలో ప్రైవేట్ కంపెనీల జోక్యం అంగీకరించం

- అత్యధిక దిగుబడి ఆధారంగానే ధర నిర్ణయం
- ఆలపాటి రామచంద్ర ప్రసాద్

**అశ్వరావుపేట, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయంలో ప్రైవేట్ కంపెనీలు చేస్తున్న కుట్రలను న్యాయపరంగా తిప్పికొడతామని ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని అల్లిపల్లి గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అశ్వరావుపేట, పెదవేగి కర్మాగారాల నూనె దిగుబడిని సరాసరి చేసి గెలలకు ధర నిర్ణయించేవారని ఆయన తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అప్పారావుపేటలో అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కొత్త ఆయిల్ పామ్ కర్మాగారాన్ని నిర్మించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పండిన ఆయిల్ పామ్ గెలలను అశ్వరావుపేట కర్మాగారం నిలిపివేస్తే అప్పారావుపేటలో, అప్పారావుపేట కర్మాగారం ఆపితే అశ్వరావుపేటలో గానుగ ఆడించడం జరుగుతుందని వివరించారు. రెండు కర్మాగారాల్లో అత్యధిక నూనె దిగుబడి సాధించిన కర్మాగారాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు గెలల ధర నిర్ణయించాలని ఆయిల్ పామ్ రైతు సంఘం తరపున చేసిన పోరాటం ఫలించిందన్నారు. గత ఐదేళ్లుగా అత్యధిక దిగుబడి సాధిస్తున్న అప్పారావుపేట ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు గెలల ధరను ఆయిల్ ఫెడ్ చెల్లిస్తోందని చెప్పారు. అయితే రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క కర్మాగారం కూడా పూర్తి చేయని ఏడు ప్రైవేట్ కంపెనీలు కలిసి అశ్వరావుపేట, అప్పారావుపేట కర్మాగారాల ఆయిల్ రికవరీని సరాసరి చేసి గెలల ధర నిర్ణయించాలని ఇటీవల హైకోర్టును ఆశ్రయించాయని పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీల కుట్రలను అడ్డుకుని రైతులకు అత్యుత్తమ దిగుబడి ఆధారంగా గెలల ధర దక్కేలా చేయడానికి ఆయిల్ పామ్ రైతు సంఘం తరపున సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయవాదులతో ఈ నెల 26న హైకోర్టులో వాదనలు వినిపించనున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పైడి వెంకటేశ్వరరావు, కె.వి. సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు, దొడ్డా ప్రసాద్, ఎర్ర వసంతం, మన్నెం అప్పారావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పునఃనిర్మాణానికి రూ.10 వేల విరాళం

**కీసర, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగారం డివిజన్ పరిధిలోని వెంకులోనిగుట్టలో ఉన్న హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పునఃనిర్మాణ పనులకు భక్తులు ముందుకు వచ్చి సహకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కీసర మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్ దేవాలయ పునఃనిర్మాణం కోసం రూ.10,000 విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులు తుడుం శ్రీనివాస్ మరియు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వెంకులోనిగుట్టలో ఉన్న ఈ పురాతన దేవాలయానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దేవాలయ పునఃనిర్మాణానికి భక్తులు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని దేవస్థాన ప్రతినిధులు కోరారు.

# కీసర లో దోమల బెడద తీవ్ర వెంటనే చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ వసంతకు వినతిపత్రం
- మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్ డిమాండ్




**కీసర, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని కీసర ఉమ్మడి గ్రామంతో పాటు అంకిరెడ్డిపల్లి, చీర్యాల, యాద్గర్‌పల్లి, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామాలలో తీవ్రంగా పెరిగిన దోమల సమస్యను వెంటనే అరికట్టాలని కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కీసర సర్కిల్-1 ప్రజల తరఫున ఆయన కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గ్రామపంచాయతీ పాలనలో సర్పంచులు, సెక్రటరీలు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫాగింగ్ యంత్రాల ద్వారా ప్రతి వీధిలో దోమల నివారణ చర్యలు చేపట్టేవారని తెలిపారు. దీంతో దోమల సమస్య కొంతవరకు నియంత్రణలో ఉండేదని పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం ఈ గ్రామాలను గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం చేసిన తర్వాత దోమల నివారణ చర్యలు సరైన విధంగా చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. ఫాగింగ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.దోమల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు జ్వరాలు, వైరల్ వ్యాధులతో బాధపడుతున్నారని, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కీసర డివిజన్-1 పరిధిలో వెంటనే ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.అదే విధంగా కాలువలు, చెత్త నిల్వలు, నిల్వ నీటి ప్రాంతాలను శుభ్రపరిచి దోమల పెరుగుదలను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు తోడు.!

- సత్తుపల్లి నియోజకవర్గంలో రాయితీ పనిముట్ల పంపిణీ

**సత్తుపల్లి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**






వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు యాంత్రీకరణ పద్ధతులను అవలంబించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సూచించారు. సోమవారం సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025-26 కింద రాయితీ పనిముట్లను పంపిణీ చేశారు. సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రోటావేటర్లు, బేలర్లు, స్ప్రేయర్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా లేక పెట్టుబడి భారంగా మారుతోందన్నారు. రైతులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో సాంకేతికత, యాంత్రీకరణకు ప్రాధాన్యం పెరుగుతోందని, రైతులు ఆధునిక పద్ధతులను స్వీకరించి ఉత్పాదకత పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, సత్తుపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్ప రెడ్డి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

- దమ్మపేట తహశీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం.






**దమ్మపేట, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దమ్మపేట మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎల్లప్పుడూ పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉడుతనేని విశ్వేశ్వరరావు, గూడ ముత్యాలరావు, తంబళ్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగరాజు, మండల ఉపాధ్యక్షురాలు కారం రత్నకుమారి, మహిళా మండల అధ్యక్షురాలు కొమ్మినపల్లి రజిత, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు కొరస వీరభద్రం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సొరకాయల సీతారాములు, మైనార్టీ మోర్చా నాయకులు ఎస్.కె. బాజీ, గంగిశెట్టి ప్రసాద్, పల్లపు శిరీష తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సత్కారం

- విశ్వశాంతి విద్యాలయంలో ఘనాభినందన

**సత్తుపల్లి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**







స్థానిక మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కొలపనేని గగనశ్రీని సోమవారం విశ్వశాంతి విద్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో అండర్-17 విభాగంలో నాలుగో స్థానం సాధించడం ద్వారా ఆమె ప్రతిభను చాటుకున్నారు. గత సంవత్సరం విశ్వశాంతి విద్యాలయంలో 10వ తరగతి పూర్తి చేసిన గగనశ్రీ తన పాఠశాలకు విచ్చేసిన సందర్భంగా ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఆమెను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా గగనశ్రీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో అండర్-17 విభాగంలో సింగిల్స్, మిక్స్డ్ డబుల్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించడం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఒడిశాలో జరిగిన ఆల్ ఇండియా స్థాయి పోటీలలో నాలుగో స్థానం పొందడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో నిరంతరం సాధన కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గగనశ్రీ తండ్రి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పామిరెడ్డిపల్లిలో ఘనంగా ప్రారంభమైన శ్రీశ్రీశ్రీ శ్రీశైల మల్లికార్జున నాటకం

**పెద్దమందడి,మార్చి16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ శ్రీశైల మల్లికార్జున నాటకం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై నాటకోత్సవాన్ని ప్రారంభించారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి సహకారంతో పాటు స్పాన్సర్ల అండతో ఈ నాటక కార్యక్రమాన్ని నిర్వహించారు.నిర్వాహకులు యాదయ్య గౌడ్, కొంటెమోని మహేష్, డోలు శ్రీశైలం, సీలయ్య గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం వైభవంగా సాగింది.మొదటి రోజు భజన మండలి, నాట్య మండలి సభ్యులు పాల్గొని భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.ఐదు రోజుల పాటు ఈ నాటక ప్రదర్శనలు గ్రామంలో కొనసాగనున్నాయి.నాటక ప్రదర్శన నటిమణి, సూత్రదారితో ప్రారంభమై చంద్రగుప్త మహారాజు సంతాన ఫలమునకు అడవిలో ఘోర తపస్సు చేయడం, ఆ తపస్సుకు శివుడు ప్రత్యక్షమై వరం ప్రసాదించడం వరకు కథాంశాన్ని ప్రదర్శించారు.5 రోజుల నాటకోత్సవానికి ప్రతిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



# నాచారంలో సమస్యలపై డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

- దోమల నివారణకు వారంలో రెండు సార్లు ఫాగింగ్ చేయాలని డిమాండ్
- ప్రజా పాలన హామీలు అమలు కాలేదని ఆక్షేపణ

**నాచారం, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**




ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బీజేపీ నాయకులు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాంతంలో పెరుగుతున్న దోమల బెడదపై ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రత్యేకంగా నాచారం డివిజన్ పరిధిలో దోమల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వారానికి కనీసం రెండు సార్లు ఫాగింగ్ నిర్వహించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం, హెచ్ఎంటీ నగర్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రామచందర్ రావు పిలుపు మేరకు ఉమ్మడి నాచారం డివిజన్ అధ్యక్షుని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం "ప్రజా పాలన" పేరుతో ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఈ సందర్భంగా వారు విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్ పోతగాని, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి, డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్ రావు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ అనిత పద్మారెడ్డి, ప్రకాశ్, పాదం వెంకటేష్, కాటిపల్లి రవీందర్ రెడ్డి, ఉదయ్ రెడ్డి, దయా గౌడ్, నవీన్ గౌడ్, నవీన్ రెడ్డి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల వాణి, వరలక్ష్మి, బాలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం - 17 - మార్చి 2026




## కాప్రా సర్కిల్‌లో దోమల బెడద తీవ్రం వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి

_డిప్యూటీ కమిషనర్ శ్రీహరికి వినతిపత్రం సమర్పించిన కాలనీవాసులు
– ఫాగింగ్, పారిశుధ్య చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్

**కాప్రా, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్.రావు నగర్, కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్లలో దోమల బెడద తీవ్రంగా పెరిగిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఫాగింగ్ యంత్రాల ద్వారా ప్రతి వీధిలో దోమల నివారణ చర్యలు చేపట్టేవారని, దీంతో సమస్య కొంతవరకు నియంత్రణలో ఉండేదని వారు తెలిపారు. అయితే గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం అయిన తరువాత దోమల నివారణ చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపించారు.ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించకపోవడంతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు జ్వరాలు, వైరల్ వ్యాధులతో బాధపడుతున్నారని, ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు.కాప్రా డివిజన్ పరిధిలో వెంటనే ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను వారు కోరారు. అదేవిధంగా కాలువలు, చెత్త నిల్వలు, నిల్వ నీటి ప్రాంతాలను శుభ్రపరిచి దోమల పెరుగుదలను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వెల్టూర్ సర్పంచ్ అశోక్‌ను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి,మార్చి16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సర్పంచ్ దండు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మహబూబ్‌నగర్‌లోని ఆర్.ఆర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. కిడ్నీలో రాయి (స్టోన్) రావడంతో వైద్యుల సూచన మేరకు ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం ఆదివారం తన స్వగ్రామం వెల్టూర్‌కు తిరిగి చేరుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం వెల్టూర్ గ్రామానికి వచ్చి సర్పంచ్ అశోక్‌ను వారి నివాసంలో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అక్కడే



క్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సాకే వెంకటయ్య, మాజీ గ్రామ రైతుబంధు అధ్యక్షులు రఘువర్దన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ సెలక్షన్ కమిటీ సభ్యుడు చిత్తూరు కృష్ణారెడ్డి, దండు నరేష్, సుంకరి బుసయ్య, సుద్ద బాయి రాజు, జింకల బాలరాజు, తమ్మలి రాము, జింకల సాయి తదితరులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక సహాయం

**పెద్దమందడి,మార్చి16(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఖాజాబీ బేగం (భర్త ఖతల్) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అంత్యక్రియల నిర్వహణకు సహాయంగా రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భం



గా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరఫున సహాయం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పామిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు సిద్ధయ్య తిక్కన్న, రాజ మల్లయ్య, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పట్టపగలే ఇల్లు చోరీ.. కీసర సుభాష్ నగర్‌లో కలకలం

- తలుపులు పగులగొట్టి 3 తులాల బంగారం, మొబైల్ అపహరణ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**కీసర, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండలంలోని సుభాష్ నగర్ కాలనీలో పట్టపగలే ఇల్లు చోరీ జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాలనీలో నివాసం ఉంటున్న ఆర్. వెంకట్ రెడ్డి భార్య శిరీష ఇంట్లో ఈ చోరీ జరిగింది.ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఇంట్లో ఉన్న అల్మారాలు పరిశీలించి సుమారు మూడు తులాల బంగారం మరియు ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించి పరారయ్యారు. ఇంటివారు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి



వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బంగారం, ఐఫోన్ కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. కాలనీలో ఇటీవల జరుగుతున్న చోరీ ఘటనలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భద్రాద్రి అభివృద్ధిపై మంత్రి తుమ్మల ఫోకస్.!

- జిల్లా కలెక్టర్‌తో సమావేశం
- కీలక ప్రాజెక్టులపై దిశానిర్దేశం
- నవమికి భద్రాచలానికి సీఎం రేవంత్ రెడ్డి

- భారీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు



**కొత్తగూడెం, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై జిల్లా కలెక్టర్ అంకిత్‌తో మంత్రి సమావేశమై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భద్రాద్రి ఆలయ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వే లైన్, పర్యాటక రంగం, రహదారి పనులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనకు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేకంగా సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా, భక్తులకు వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. "భక్తుల సేవలో ప్రభుత్వం" అనే నినాదంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భక్తులు సౌకర్యంగా కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేలా ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను మొత్తం రూ.300 కోట్లతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో సుమారు రూ.100 కోట్లతో చేపట్టనున్న భద్రాద్రి ప్రాకారం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సీఎం పర్యటనను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు డివైడర్లు, సెంటర్ లైటింగ్, పూల మొక్కల నాటకం వంటి సుందరీకరణ పనులను ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సాగునీటి విస్తరణకు కీలకమైన సీతారామ డిస్ట్రిబ్యూటరీ పనులకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు పనులు వేగవంతమై రైతులకు త్వరగా ప్రయోజనం చేకూరుతాయని తెలిపారు. అలాగే యాతాలకుంట టన్నెల్‌లో మిగిలిన సుమారు 100 మీటర్ల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 50 వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. భద్రాద్రి అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం-మల్కానగిరి రైల్వే లైన్‌కు అనుమతి లభించిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో సారపాక వరకు భూసేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైల్వే లైన్ పూర్తయితే భద్రాద్రి ప్రాంతంలో పర్యాటక రంగానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అలాగే జిల్లాలోని బిపిఎల్, హెవీ వాటర్ ప్లాంట్లకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి అనువైన భూమిని గుర్తించాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. భద్రాచలం, కొత్తగూడెం మధ్య అనుకూల ప్రదేశాలను గుర్తించి సంబంధిత శాఖలు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. కొత్తగూడెం-భువనగిరి రహదారి పరిధిలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడి వ్యాపార కార్యకలాపాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న సబ్సిడీలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఈ కీలక ప్రాజెక్టుల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు







# ప్రజావాణిలో 125 దరఖాస్తులు స్వీకరణ

- సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 125 దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ మాలతితో పాటు జిల్లా అధికారులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎంతో వ్యయప్రయాసలతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారికి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు.అలాగే తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుజాత, ఎఫ్ & జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణమూర్తి, డీఆర్‌డీఏ సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలకై ఖమ్మం జర్నలిస్టుల రిలే నిరాహార దీక్ష

- యూనియన్ల కతీతంగా హాజరై మద్దతు తెలిపిన సీనియర్ జర్నలిస్టులు
- ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్
- ఖమ్మం ప్రెస్ క్లబ్లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

**ఖమ్మం బ్యూరో, మార్చి 16(తెలంగాణ ముచ్చట్లు ):** జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఖమ్మం జర్నలిస్టులు కొరకొప్పుల రాంబాబు, టిఎస్ చక్రవర్తి లు ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకై ఖమ్మం ప్రెస్ క్లబ్లో సోమవారం రిలే నిరాహార దీక్షలు ఉదయం 10 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5గంటకు ముగించారు. తిరిగి మంగళవారం ఉదయం 10 గంటలకు రిలే నిరాహారదీక్ష ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కొరకొప్పుల రాంబాబు, టిఎస్ చక్రవర్తి లు మాట్లాడుతూ.. ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించబడిన 23.02 ఎకరాల




భూమిని సొసైటీలో సభ్యత్వం కలిగిన 320 మంది జర్నలిస్టులకు 200 గజాల చొప్పున వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షకు పలువురు సీనియర్ జర్నలిస్టులు ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడే జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల చేత లబ్ధి చేకూరే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జర్నలిస్టులకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాల కోసం భూధాన్ భూమి, వెలుగుమట్ల పేద ప్రజలు సాధించిన పోరాటంను జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాలని కోరారు.

సంఘీభావం తెలిపిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు పాలకుర్తి కృష్ణ, పూలే అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దామాల సత్యనారాయణ, ఉద్యమ కారుల ఆకాంక్ష వేదిక బట్టు రాజేందర్ నాయక్, డెస్క్ జర్నలిస్ట్ నాయకులు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కట్టెకోల చిన్న నర్సయ్య, పసుపులేటి సత్యనారాయణ, అమరవరపు కోటేశ్వరరావు, ఉపేందర్, భద్రయ్య, ఉత్కంఠం శ్రీనివాస్, బండి కుమార్, సామ్రాట్ గుప్త, పులి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, కూరపాటి నరేష్, కిరా9 రమేష్, డాక్టర్ లింగయ్య, డాక్టర్ చిన్ని, మంద వెంకటేశ్వర్లు, పెంటి వెంకటేశ్వర్లు, నవజీవన ప్రియా, బిక్షం, పాస్ట్ న్యూస్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జికె జ్ఞానమాల కమిటీ ఆధ్వర్యంలో మహనీయులకు 7వ జ్ఞానమాల

- ముఖ్య అతిథులుగా కొడాలి చంటి, ప్రసాద్ పాల్గొన్నారు

**కీసర, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర సర్కిల్-1 దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో జ్ఞానమాల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మహనీయులకు జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ప్రతి ఆదివారం నిర్వహించే పూలమాల కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 7వ వారపు జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొడాలి చంటి, ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను, వారి స్ఫూర్తిని సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరేలా చేయాలని పిలుపునిచ్చారు. ఒక సందర్భంలో అమెరికాలో ప్రసాద్‌ను కలిసినప్పుడు కూడా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనల దిశగా సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని చర్చించుకున్నామని తెలిపారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, సమానత్వం వంటి విలువలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఆర్‌జికె కాలనీ, డబుల్ బెడ్ రూమ్



అహ్మద్‌గూడ అంబేద్కర్ సంఘం తమను ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షులు డాక్టర్ గొల్లూరి రాజు, గౌరవ అధ్యక్షులు మంగళపూరి వెంకటేష్, ముఖ్య సలహాదారు అబ్బులు, కార్యనిర్వాహక అధ్యక్షులు పాము రంగయ్య, కోశాధికారి గాలి సురేష్, సంయుక్త కార్యదర్శులు నామడి రాజా, రామకృష్ణ, సందీప్, సహాయ కార్యదర్శులు నరేష్, కన్నయ్య, జి.దాసు, ఎండి ఖదీర్, డి.నాగేశ్వరరావు, డి.అజయ్, ఎం.వెంకటేష్, జి.ప్రభాకర్, బి.గౌతమ్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సీనియర్ పాత్రికేయుడు వెంకటరమణారెడ్డి సంస్మరణ సభ



**భీమదేవరపల్లి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన ప్రజాజ్యోతి సీనియర్ పాత్రికేయుడు కీర్తిశేషులు ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి గారి సంస్మరణ సభను సోమవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ మండపంలో మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జర్నలిజం రంగంలో ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ పలువురు ప్రముఖులు, సహచర పాత్రికేయులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

సభ ప్రారంభంలో ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనతో కలిసి పనిచేసిన సహచరులు, సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ ఆయన జీవిత ప్రయాణాన్ని స్మరించుకున్నారు. నిజాయితీ, నిబద్ధత, ప్రజల పట్ల అపారమైన బాధ్యతతో ఆయన జర్నలిజం రంగంలో పనిచేశారని వారు కొనియాడారు. సమాజ సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు న్యాయం చేయాలనే తపనతో ఆయన కలం నిరంతరం కదిలిందని తెలిపారు.

పలువురు ప్రసంగకర్తలు మాట్లాడుతూ గ్రామీణ సమస్యలు, ప్రజల కష్టాలు, ప్రభుత్వ పథకాల అమలు లోపాలు వంటి అంశాలను ధైర్యంగా వెలుగులోకి తీసుకువచ్చిన పాత్రికేయుడిగా వెంకటరమణారెడ్డి పేరు నిలిచిపోయిందన్నారు. ఆయన రచనలు ఎంతోమంది యువ పాత్రికేయులకు మార్గదర్శకంగా నిలిచాయని, నిజాయితీగా వార్తలను అందించాలనే బాధ్యతను గుర్తుచేసేలా ఆయన జీవితం ఉందని పేర్కొన్నారు. జర్నలిజం రంగంలో ఆయన మరణం తీరని లోటని, ఆయన కలం ఆగిపోయినా ఆయన సేవలు, జ్ఞాపకాలు ఎప్పటికీ పాత్రికేయుల హృదయాల్లో నిలిచిపోతాయని భావోద్వేగంతో చెప్పారు. సమాజానికి అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా ఆయనను ఎప్పటికీ స్మరించుకుంటామని తెలిపారు.

ఈ సంస్మరణ సభలో పాల్గొన్న ఎల్కతుర్తి సీఐ వంగర, ముల్కనూర్ ఎస్సైలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు సీనియర్ మరియు యువ పాత్రికేయులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ధైర్యం చెబుతూ ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు తమ నివాళులు అర్పించారు. సభ మొత్తం ఆయన జ్ఞాపకాలతో భావోద్వేగ వాతావరణంలో కొనసాగింది.

# అంజనాపురంలో 11 కేవీ లైన్ వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి

- **విద్యుత్ శాఖ ఏడిఈ ని కలిసి వినతిపత్రం అందించిన వార్డు మెంబర్ లకావత్ పవన్ నాయక్**
- **సానుకూలంగా స్పందించిన విద్యుత్ శాఖ**



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు) :** బూర్గంపాడు మండలంలోని అంజనాపురం గ్రామంలో నివాస గృహాల మధ్యగా ప్రమాదకరంగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించి, ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేయాలని రెండో వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ భద్రాచలం ఏడిఈరిని కలిసి వినతి పత్రం అందించినారు. సోమవారం రోజు భద్రాచలం ఏడిఈ ఆఫీస్ కి వెళ్లి, గ్రామంలో ఇళ్ల మధ్యగా ఉన్న ఈ హైవోల్టేజ్ విద్యుత్ లైన్ కారణంగా ఎప్పటికప్పుడు ప్రమాద భయం నెలకొన్నదని ఆయన తెలిపారు. గాలి తుఫాను, వర్షాలు వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉండటంతో, గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి, గ్రామానికి బయట లేదా, రహదారి మార్గం వెంట ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలని, ఆయన విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అత్యవసరంగా స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని, వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ తెలిపారు విద్యుత్ అధికారులు త్వరలోనే గ్రామాన్ని సందర్శించి, దానికి సంబంధించిన ఎస్టిమేషన్లు వేపిచ్చి, త్వరగానే ప్రత్యామ్నాయంగా విద్యుత్ లైన్ లో ఏర్పాటు చేస్తామని చెప్పేసి అధికారులు సానుకూలంగా స్పందించినారు. స్పందించిన విద్యుత్ అధికారులకు వార్డు మెంబర్ లకావత్ పవన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపినానని ఆయన తెలిపారు.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం... ఇద్దరు మృతి

- **అతివేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు**
- **శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన**
- **రోడ్డు పక్కన భోజనం చేస్తుండగా ప్రమాదం**

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చ్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మౌలాలి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్నారు.మార్గమధ్యలో ఆకలి వేయడంతో వారు కారును రోడ్డు పక్కన నిలిపి భోజనం చేస్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి అత్యంత వేగంగా వచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టింది. కంటైనర్ వేగానికి కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది.ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కంటైనర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను నిలపడం అత్యంత ప్రమాదకరమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.

# పోలీసుల ఆరోగ్యమే మా ప్రాధాన్యం

- **ఎల్బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయంలో మెగా హెల్త్ క్యాంప్**
- **మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు**
- **క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక దృష్టి**





**మల్కాజ్గిరి , మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల రక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో ఒమేగా ఆసుపత్రి, ఫోర్ట్ డెంటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రుల సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ (ఆర్బీఎస్), లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, 2డీ ఎకో వంటి సాధారణ పరీక్షలతో పాటు ఎముకల పటుత్వాన్ని అంచనా వేసే బీఎండీ పరీక్షలు నిర్వహించారు.క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 45 ఏళ్లు దాటిన పురుషులకు పీఎస్ఏ (PSA) పరీక్షలు, 40 ఏళ్లు పైబడిన మహిళా సిబ్బందికి పాప్ స్మియర్, మేమోగ్రామ్ పరీక్షలు చేశారు.అలాగే ఫోర్ట్ డెంటల్ వైద్యులు దంత సమస్యలపై పరీక్షలు చేయగా, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిపుణులు కంటి చూపు సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా డీసీపీ (అడ్మిన్) ఇందిరా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, ముందస్తు వైద్య పరీక్షల ద్వారానే అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూనిట్ వైద్యులు సరిత, అచ్యుతరావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం మంగళవారం కూడా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# స్త్రీల సాధికారతకు స్వయం ఉపాధి మార్గం

- **రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్**
- **ఖమ్మంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ**





**ఖమ్మం బ్యూరో, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు)**

స్త్రీలు సాధికారత సాధించి స్వయం ఉపాధితో తమ కాళ్ల మీద తాము నిలబడటం సమాజానికి ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మం పట్టణంలోని యూపిహెచ్ కాలనీలో 'సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్' (సిడిఏ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ జీవితాలను మరింత స్థిరంగా మార్చుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచనలతో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచన ఉందని తుమ్మల యుగంధర్ తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలను సిడిఏ సంస్థ ముందుగా చేపట్టడం అభినందనీయమని నిర్వాహకులు సిడిఏ కార్యదర్శి రెవరెండ్ ఎనోష్ కుమార్‌ను అభినందించారు. సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలకు తమ వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ఎటువంటి సహాయం కావాలన్నా తమవంతు సహకారం తప్పకుండా అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు కుట్టు మిషన్ల సహాయంతో ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు ఆదారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మరింత విస్తరించాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిఏ కార్యదర్శి ఎనోష్ కుమార్, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు తుంపాల కృష్ణమోహన్, టీఎన్జీవో గెజిటెడ్ ఖమ్మం టౌన్ అధ్యక్షులు ఇంజం కృష్ణార్జునరావు, కర్లకుంట దావీదు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ని కలిసేందుకు వెళ్లిన విశారదన్ మహారాజ్‌ని అరెస్టు చేసిన పోలీసులు

**ఖమ్మం బ్యూరో,మార్చి 16(తెలంగాణ ముచ్చట్లు)**

వెలుగుమట్ల భూదాన బాధితుల న్యాయం కోసం భారీ ధర్నాను నిరవర దీక్షలను చేపట్టి ఈ రాజ్యం మెడలు వంచి ఆ వెలుగుమట్ల భూమిలోనే ఇల్లు నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది .. కానీ 311మందికే అని ప్రకటించడం 101 మందికి వారి గ్రామాల్లో ఇందిరమ్మ స్కీమ్ ఇస్తామని అనటం ఇంకా 400 మంది అర్హులైన వారిని గుర్తించకపోవడం పట్ల విశారాధన్ మహారాజ్ కలెక్టర్ ను కలిచేందుకు మధ్యాహ్నం ఒంటిగంటకు ఆసమీప ప్రాంతనికి రాగానే పోలీసులు అరెస్టు చేశారు . కొనిజర్ల పోలీస్ స్టేషన్ నుండి వైరా పోలీస్ స్టేషన్కు తరలించి అక్కడ నుండి మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నుండి మధిర రూరల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.. విశారదన్ రాక తెలుసుకున్న కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్ కే రాకుండా ఉండటం అనేది సిగ్గుచేటు . మీరు ఎన్ని అరెస్టులు చేసినా ఎంత నిబంధన పెట్టినా ఈ ఉద్యమాన్ని ఈ దేశ రాజధాని ఢిల్లీ దాకా తీసుకువెళ్లిన సరే అమర నిరాహార దీక్షలు చేసైనా సరే 62 ఎకరాల భూదాన భూమిని న్యాయబద్ధంగా సాధిస్తాం .. మీరు కూల్చిన 725 ఇళ్లను మీతోనే పక్కాభవనాలు అదే ప్లేస్ లో కట్టిస్తాం .. అప్పటివరకు మా పోరాటం ఆగదని విశారాధన మారాజు వెల్లడించారు .. ఖమ్మం ప్రాంతానికి చెందిన పోడకండి రాంబాబు బీసీ ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఉంటూ ఈ బాధితులను ఆర్గనైజ్ చేస్తున్నాడని అతని ఇంటి చుట్టూ పోలీసులు పాహారాబెట్టి అతను అరెస్టు చేయాలని చూస్తున్నారు .. రాంబాబు జోలికి వెళితే పోలీసులపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని అన్నారు .. విశారదన్ వెంటనే విడుదల చేయాలని బాధితులు అతని వెంటే అన్ని స్టేషన్లకు తిరుగుతున్నారు .



# సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**పెద్దమందడి,మార్చి16(తెలంగాణ ముచ్చట్లు):** ఉగాది పండుగ సందర్భంగా సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఆయన నవతరం కవులు, సాహితీవేత్తలు వినిపించిన కవితలను ఆలకించి వారిని సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుగానికి ఆదిగా నాంది పలుకుతున్న ఉగాది పండుగకు స్వాగతం పలుకుతూ, పరాభవ నామ సంవత్సరంలో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. సాహిత్యంలో గాంభీర్యం, పట్టు ఉన్న కవితలు ప్రశంసనీయం అని పేర్కొన్న ఆయన, ప్రజలకు సరళమైన భాషలో కవిత్వాన్ని అందించడం ఒక ప్రత్యేక నైపుణ్యమని తెలిపారు.భాష అభివృద్ధి, సంస్కృతి మరియు సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత నవతరం కవులపై ఉందని అన్నారు. పండుగలు, జాతరలు ప్రజల జీవనశైలికి ముడిపడి ఉంటాయని, ఆచార వ్యవహారాలు మరియు జీవించే విధానాన్ని తెలియజేస్తాయని చెప్పారు.వ్యవసాయ పనులు ప్రారంభమయ్యేందుకు ఉగాది పండుగ శుభసూచకమని తెలిపారు. వ్యవసాయాన్ని తపస్సు, యజ్ఞంలా భావించి భావితరాలు ఆదరించేలా కవితలు ఉండాలని సూచించారు. ప్రస్తుతం సంఘజీవిగా ఉండే మనిషి కూడా ఏకాకిగా ఉండాలని కోరుకునే పరిస్థితి పెరుగుతోందని, ఇది ప్రజల ఐక్యమత్యానికి మరియు అనుబంధాలకు ప్రమాదమని ఆయన అభిప్రాయపడ్డారు.మేధావులు, కవులు, సాహితీవేత్తలు ప్రపంచ శాంతిని కోరుకునే విధంగా ప్రజలను ప్రభావితం చేసే కవిత్వాన్ని సృష్టించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, హేమంత్, చిట్యాల రాము కుమార్, మంద రాము, ముద్దుసార్ తదితర కవులు పాల్గొన్నారు. అలాగే సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, నారాయణ రెడ్డి, డాక్టర్ వీరయ్య, ఖాజా మైనుద్దీన్, బైరోజు చంద్రశేఖర్ మరియు పలువురు సాహితీవేత్తలు హాజరయ్యారు.

# సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్..

- **మస్జిద్ ఏ ఖుబా పాండంగాపురం ఇఫ్తార్లో రఘునాథ పాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్..**

**ఖమ్మం బ్యూరో, మార్చి 16(తెలంగాణ ముచ్చట్లు)**

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులని రఘునాథ పాలెం పోలీస్ స్టేషన్ సిఐ ఉస్మాన్ షరీఫ్ అన్నారు.. సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనీ పాండురంగాపురం రెండవ డివిజన్లో గల మస్జీద్ ఏ ఖుబాలో పాల్గొని ఆయన మాట్లాడారు... క్రమశిక్షణకు, సహనంకు రంజాన్ మాసం ఎంతో పవిత్రతతో కూడుకున్నదని, ఐదు పూటల నమాజ్ తో పాటు రంజాన్ ప్రత్యేక తరావీహ్ నమాజు ప్రతి ఒక్కరు ఆచరిస్తూ అల్లాహ్ ను వేడుకుంటూ.. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో మనమందరం నడుచుకుందామని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం నమాజు చేసుకొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈకార్యక్రమంలో మస్జిద్ ఏ ఖుబా సదర్ (ప్రెసిడెంట్ ) ఫయాజ్, పూర్వ సదర్ అఫ్జల్మియా, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సలీం, మస్జిద్ మతపెద్ద గులాం రబ్బాని, ఖమ్మం జిల్లా ఏఐటీయూసీ నాయకులు షేక్ ఇబ్రహీం, టైలర్ హుస్సేన్ భాయ్, ఇంటెలిజెన్స్ ఎస్ ఐ షేక్ రహీం, కరాటే ఖాసీం, జర్నలిస్ట్ జానిపాషా, షేక్ రజిమ్, పోలీస్ చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారిణి

**ఖమ్మం బ్యూరో, మార్చి -16(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ప్రజల అర్జీలను స్వీకరించారు. తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కే. కిరణ్ కుమార్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనంలోకి మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నుంచి ఖమ్మం మూడవ టౌన్ ప్రాంతం గాంధీ చౌక్ లో ఉన్న ఈద్గాను మరమ్మత్తులు, గోడ నిర్మాణం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్డీఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మండలం కోష్టాల గ్రామానికి చెందిన వార్డు సభ్యులు వి. సాంబయ్య గ్రామ సర్పంచ్ తన ఇష్టానుసారంగా నర్సరీ మొక్కలను పెంచుతున్నారని గ్రామానికి నష్టం జరుగుతుందని నివారించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా ఎంపిడిఓ/డి.ఎల్.పి.ఓ. కు రాస్తూ విచారించి తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలి

- మేడ్చల్–మల్కాజ్గిరి కలెక్టరేట్ వద్ద 48 గంటల దీక్ష
- సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల నిరసన
- పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని డిమాండ్

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించి, వారి సమస్యల పరిష్కారానికి నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం)కు సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద 48 గంటల నిరసన దీక్ష నిర్వహించారు.ఈ దీక్షను సిఐటియు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ ప్రారంభించారు.కార్యక్రమానికి సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం, ఐద్వా మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోదతో పాటు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎర్ర అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత రెండు దశాబ్దాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారని పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ ఆశా వర్కర్లకు చట్టబద్ధ సౌకర్యాలు లేకపోవడం, కనీస ఫిక్స్డ్ వేతనం నిర్ణయించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల పాటు నిరవధిక సమ్మె నిర్వహించినప్పుడు ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆ హామీలను అమలు చేయలేదని విమర్శించారు.అదేవిధంగా రూ.50 లక్షల బీమా, రూ.50 వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు కూడా అమలు కాలేదని తెలిపారు. పి.ఆర్.సి ఎరియర్స్, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీలకు సంబంధించిన డబ్బులు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాలు కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడంతో ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కావున అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించి, ఎన్హెచ్ఎంకు సరిపడా నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఆశా యూనియన్ అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి రేవతి కల్యాణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉన్నికృష్ణన్, నాయకురాళ్లు ప్రవీణ, కోమలత, రాధా, లత, బలమని, సిఐటియు నాయకులు రాజశేఖర్, లింగస్వామి, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఐద్వా మహిళా సంఘం నాయకులు లీలావతి, మంగ సంఘీభావం తెలిపారు.

# భవిత కేంద్రం, విద్యా సంస్థల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, మార్చి - 16(తెలంగాణ ముచ్చట్లు)**





ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు (దివ్యాంగులైన) అన్ని రకాలుగా శిక్షణ, సహకారం అందించి సాధారణ పిల్లలకు సమానంగా తీర్చిదిద్దడమే భవిత కేంద్రం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
సోమవారం వైరా నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ గల భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా మెరుగైన మౌళిక సదుపాయాలతో రూపొందించిన పురోగతి పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. వాల్, పెయింటింగ్, బలహీనమైన పిల్లలకు ఫిజియోథెరపీ, వినికిడి, స్పీచ్ థెరపీ మిషనరీ, కృత్రిమ పరికరాలతో అక్కడ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మెరుగుపరచాలని, వివిధ బోధన ఉపకరణాలతో నాణ్యమైన విద్యను అందించి వారి మానసిక అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
అనంతరం కొణిజర్ల మండలం చిన్న మునగాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు, మూడవ తరగతి గదులలో విద్యార్థులు ఇంగ్లీషు అక్షరాలు, పదాల ఉచ్చారణను కలెక్టర్ చదివించారు. అదే ప్రాగణంలో ఉన్న ఆంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణి మహిళలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం, కోడిగుడ్లు అందించాలని సిబ్బందికి సూచించి, రికార్డు పుస్తకాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగులైన పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చిన్న వయసులోనే ఈ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా తల్లిదండ్రుల అవసరం లేకుండా వారి పనులు వారే చేసుకునే స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాల్లోని దివ్యాంగులైన పిల్లల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని, కావాలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.
ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆధునిక యంత్రాలు, వసతులతో వివిధ వైకల్యం కలిగిన శారీరకంగా బలహీనమైన వారికి ఫిజియోథెరపీ, మాటలు రాని వారికి స్పీచ్ థెరపి ఇప్పించడం, వినికిడి సక్రమంగా లేని పిల్లలకు వినికిడి పరికరాలు, ప్రత్యేకమైన బోధన ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.
భవిత సెంటర్ లలో ప్రతిపాదించిన అభివృద్ధి పురోగతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, దివ్యాంగ విద్యార్థులకు అనుకూలంగా భవిత సెంటర్లను తీర్చిదిద్దాలని తెలిపారు. అధికారులు అంగన్వాడీ, భవిత సెంటర్ ప్రభుత్వ అభివృద్ధి పనులు, భవనాలు, పాఠశాలల్లో కిచెన్ షెడ్, శౌచాలయాల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.
అదే విధంగా నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా గుత్తేదారులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. శిధిలావస్థ లో ఉన్న అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి వాటి స్థానంలో నూతనంగా మంజూరైన భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏ విషయంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, పాఠశాల ఆదనపు తరగతి గదులు నిర్మాణాల ఏర్పాటులో జాప్యం చేయకూడదని ఇదివరకే అనుమతులు ఇచ్చిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ ప్రవీణ్ కుమార్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, కొణిజర్ల మండల విద్యాధికారి అబ్రహం, హెడ్ మాస్టర్ నాగమల్లేశ్వర రావు, ఏఈ సురేష్, సర్పంచ్ పూనాటి బాబురావు, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎఫ్‌సి ఆర్ఓబీ విస్తరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి

- మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన
- ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన
- స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిక

**మల్లాపూర్, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



కాప్రా సర్కిల్ పరిధిలోని ఎన్ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)ను తక్షణమే విస్తరించి ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోమటి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఎం కాప్రా సర్కిల్ కమిటీ, కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఎం కాప్రా సర్కిల్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు పి. గణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా ఎన్ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి విస్తరణకు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎఫ్‌సి, ఈసీఐఎల్, చర్లపల్లి పారిశ్రామిక వాడలోని మింట్, బిపిసిఎల్, ఐఓసీఎల్, ఎఫ్‌సీఐ గోదాం, బిఈఎల్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. అలాగే చర్లపల్లి, నాచారం, మల్లాపూర్, మౌలాలి ప్రాంతాల కాలనీవాసులు, విద్యార్థులు కూడా ఇదే మార్గంపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు.ఇటీవల చర్లపల్లి రైల్వే టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ మార్గంలో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. అయితే బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదాల ముప్పు పెరిగిందని, ట్రాఫిక్ రద్దీ కారణంగా అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎన్ఎఫ్‌సి ఆర్ఓబీ విస్తరణ పనులను వెంటనే చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కాలనీవాసులు, కార్మికులు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు వెంకటచారి, సిహెచ్‌వి ప్రసాద్, బివి సత్యనారాయణ, శివనారాయణ, శ్రీమన్నారాయణ, ఎం. శ్రీనివాస్ రావు, జెన్నీ, కొండల్ రెడ్డి, జి.వి.రావు, శరత్ బాబు, సఫియా, ఈసీఐఎల్ ఈడిహెచ్బిఎస్ కార్యదర్శి జగ్గారాజు, తిరుమలనాడ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిరెడ్డి, మింట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పాలి

- 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో అవగాహన
- కూకట్పల్లి రిషి యూబీఆర్ ఉమెన్స్ కాలేజ్‌లో నిర్వహణ






మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు): 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ ఆధ్వర్యంలో "సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్" అంశంపై అవగాహన కార్యక్రమం కూకట్పల్లిలోని రిషి యూబీఆర్ ఉమెన్స్ కాలేజ్‌లో నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ బి.రాజేందర్ పాల్గొని ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే హానికారక ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా భూమి, నీరు మరియు జీవ వ్యవస్థలకు కలిగే నష్టాలను తెలియజేశారు. అలాగే నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ మార్గాల గురించి వివరించారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడంతో పాటు కొంతమంది ప్రసంగించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. అదేవిధంగా క్విజ్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించేందుకు అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు భార్గవి, పర్యావరణ ఇంజనీర్ బి.రాజేందర్ మరియు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు సమర్పించాలి..

- ఈడీ ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు


**ఖమ్మం బ్యూరో, మార్చి -16(తెలంగాణ ముచ్చట్లు)**

మార్చి 24 లోపు ఎస్సీ యువతీ, యువకులు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు సమర్పించాలని ఈడీ ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.
నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని అన్నారు.
అర్హులైన షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతీ, యువకులు స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయస్సు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమానికి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు, వేతన ఉపాధి కార్యక్రమాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు.
గత 5 సంవత్సరాలలో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ధి పొందిన కుటుంబాల వారు అనర్హులు అవుతారని, అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు.
నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు మార్చి 24లోగా తమ దరఖాస్తులను https://tgobmms.cgg.gov.in ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేయాలని, ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కమలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై అసత్య ప్రచారాలు

- నిరాధార ఆరోపణలపై కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు
- అసోసియేషన్ ప్రతిష్టను దెబ్బతీయాలని ఉద్దేశపూర్వక ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

**కుషాయిగూడ, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో కమలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అసోసియేషన్ పరిధిలో జరిగిన అగ్నిప్రమాదంపై అంతర్గత విచారణ కొనసాగుతుండగా, కొందరు అసాంఘిక శక్తులు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా తాడూరి గగన్ కుమార్ అనే వ్యక్తి అసోసియేషన్‌కు చెందిన జిమ్ సామాగ్రి కనిపించడం లేదని, కొందరు వ్యక్తులు వాటిని స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపిస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో జిమ్ సామాగ్రి భద్రంగా ఉందా లేదా అనే విషయాన్ని కూడా సరిచూసుకోకుండా పత్రికలు, ఛానళ్లకు తప్పుడు సమాచారం అందిస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను ధృవీకరించకుండానే విజయ్ క్రాంతి, మహా న్యూస్, నేడు న్యూస్ మరియు ఇండియన్ క్రానికల్ వంటి పత్రికల్లో అసత్య వార్తలు రావడం పట్ల అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా సదరు వ్యక్తి అసోసియేషన్ పేరును అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరించారని తెలిపారు. నిరాధార ఆరోపణలతో అసోసియేషన్ ప్రతిష్టను దెబ్బతీస్తున్న వారిపై మరియు తప్పుడు సమాచారాన్ని ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# స్టార్ నటి బయోపిక్‌లో సాయి పల్లవి? బాలీవుడ్ దర్శకుడితో క్రేజీ ప్రాజెక్ట్

సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న సాయి పల్లవి ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో సినీ రంగంలో అడుగుపెట్టిన ఆమె, తర్వాత 'ఫిదా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తొలి చిత్రంతోనే తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సాయి పల్లవి ఇప్పుడు వరుస అవకాశాలతో ముందుకు సాగుతోంది.

తాజాగా ఆమె బాలీవుడ్‌లో ఒక క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ప్రముఖ నటి మధుబాల జీవితం ఆధారంగా రూపొందించనున్న బయోపిక్‌లో సాయి పల్లవి ప్రధాన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించనున్నారని చెబుతున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

మధుబాల పాత్ర కోసం ముందుగా కియారా అద్వానీ, అనీత్ పడ్డా వంటి నటీమణుల పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన గాంభీర్యం మరియు సహజమైన నటనను పండించగల సామర్థ్యం సాయి పల్లవికే ఉందని చిత్రబృందం భావిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే 'పద్మావత్', 'గంగూబాయి కాఠియావాడి' వంటి చిత్రాలతో విజయాలు అందుకున్న సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో మధుబాల వంటి ఐకానిక్ పాత్రలో సాయి పల్లవి నటిస్తుందనే వార్తతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం సాయి పల్లవి హిందీలో రూపొందుతున్న 'రామాయణం' చిత్రంలో కూడా నటిస్తోంది.



## ఆమెకు 15.. అతడికి 24.. పదేళ్ల ప్రేమకు పెళ్లితో ముగింపు

సినీ ప్రపంచంలో హీరోహీరోయిన్ల మధ్య ప్రేమ కథలు కొత్త విషయం కాదు. కలిసి సినిమాల్లో నటిస్తూ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి చివరకు పెళ్లి బంధంతో ఒక్కటైన జంటలు చాలానే ఉన్నాయి. కొందరు తమ ప్రేమ విషయాన్ని ముందుగానే ప్రకటిస్తే, మరికొందరు మాత్రం చాలా కాలం పాటు రహస్యంగా ఉంచుతారు.

అలాంటి జంటలలో ఒక హీరోహీరోయిన్ కథ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హీరోయిన్‌కు 15 సంవత్సరాలు, హీరోకు 24 సంవత్సరాల వయసు ఉన్న సమయంలోనే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడినట్లు చెబుతున్నారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి దాదాపు పదేళ్ల పాటు రహస్యంగా కొనసాగిందని సినీ వర్గాల్లో ప్రచారం ఉంది.

వీరిద్దరూ తమ ప్రేమ విషయాన్ని ఎప్పుడూ బయటపెట్టకుండా జాగ్రత్తగా దాచిపెట్టారు. కెరీర్‌పై దృష్టి పెట్టిన ఈ జంట చాలా కాలం తర్వాత కుటుంబ సభ్యుల సమ్మతితో పెళ్లి చేసుకుని భార్యభర్తలుగా ఒక్కటయ్యారు.

సినిమా ప్రపంచంలో ఇలాంటి ప్రేమ కథలు అభిమానులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూనే ఉంటాయి. పదేళ్ల పాటు తమ ప్రేమను రహస్యంగా ఉంచి చివరకు పెళ్లి బంధంతో ఒక్కటైన ఈ జంట కథ ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.




## "విశ్వనాథ్ అండ్ సన్స్" టీజర్ విడుదల

దక్షిణాది స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం "విశ్వనాథ్ అండ్ సన్స్"పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ వాణిజ్య చిత్రం కాకుండా భావోద్వేగాలతో నిండిన క్రీడా నేపథ్య కథగా ఉండబోతుందని తెలుస్తోంది. ఒక షూటర్ క్రీడాకారుడి జీవితం, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత పోరాటాల చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు. హీరో పాత్రలో ఉన్న భావోద్వేగాలు కథలో కీలకంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి అమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో ముఖ్య పాత్ర పోషించనున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నలభై ఏళ్ల వయసులో హీరో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు హృద్యంగా చూపించనున్నట్టు తెలుస్తోంది.

టీజర్‌లో కనిపించిన దృశ్యాలు, నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో చిత్రీకరించిన సన్నివేశాలు, క్రీడా నేపథ్యంతో రూపొందించిన ఘట్టాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ వేగంగా కొనసాగుతుండగా, ఈ సినిమాను జూలైలో విడుదల చేయాలని చిత్రబృందం యోచిస్తోంది. క్రీడా నేపథ్యం, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందా అన్నది చూడాలి.

## సల్మాన్ ఖాన్ సినిమాకు 'మాతృభూమి' టైటిల్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న యుద్ధ నేపథ్య చిత్రం మొదట 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే పేరుతో రూపొందింది. అయితే విడుదల సమయం దగ్గరపడుతున్న వేళ ఈ చిత్రానికి కొత్తగా 'మాతృభూమి' అనే టైటిల్‌ను నిర్ణయించారు. కొత్త టైటిల్‌తో రూపొందించిన పోస్టర్‌ను చిత్రబృందం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది.

ఈ చిత్రం భారతదేశం-చైనా సరిహద్దులో 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘటన ఆధారంగా తెరకెక్కుతోంది. అపూర్వ లాఖియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తోంది. ఇటీవల విడుదలైన టీజర్ తర్వాత ఈ చిత్రంపై చైనా ప్రభుత్వానికి చెందిన కొన్ని మీడియా సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గల్వాన్ ఘటనకు సంబంధించిన విషయాలను వక్రీకరిస్తున్నారంటూ విమర్శలు వచ్చాయి. ఈ వివాదాల నేపథ్యంలోనే చిత్రబృందం టైటిల్‌ను మార్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కొత్త టైటిల్ 'మాతృభూమి'గా ప్రకటించడంతో వివాదాలకు ముగింపు పడుతుందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.





## మౌనీ రాయ్ లేటెస్ట్ ఫొటోలు వైరల్

బాలీవుడ్ అందాల నటి మౌనీ రాయ్ తాజా ఫొటోషూట్ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తన గ్లామర్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటూ ఆమె పంచుకున్న చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

బుల్లితెరపై తన కెరీర్ ప్రారంభించిన మౌనీ రాయ్ తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా 'నాగిన్' ధారావాహిక ఆమె కెరీర్‌కు పెద్ద మలుపు తీసుకువచ్చింది. ఈ ధారావాహిక తెలుగులో 'నాగిని' పేరుతో ప్రసారమై ఇక్కడి ప్రేక్షకులకూ ఆమెను మరింత దగ్గర చేసింది.

ఆ ధారావాహికలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న మౌనీ రాయ్ యువతలో ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకుంది. అనంతరం పెద్ద సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుని తన నటనతో ప్రశంసలు పొందింది. ముఖ్యంగా 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నటించి సినీ విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుకుగా ఉండే మౌనీ రాయ్ తన వ్యక్తిగత, వృత్తి జీవితానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫొటోలను చూసి అభిమానులు ప్రశంసలు కురిపిస్తూ విభిన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. "అందం అంటే మౌనీ రాయే" అంటూ అభిమానులు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in